

నేను సొంతపన్లకన్నా బయటవాళ్ళ పనులను ఎంతో శ్రద్ధగా చేస్తూ వూరంతా తిరుగుతానని మా ఇంట్లో వాళ్ళ మూకుమ్మడి అభిప్రాయం. ఆ మాట అర్ధసత్యమే కానీ, పూర్ణ సత్యం కాదు. ఎవరైనా ఏదైనా పని చేసిపెట్టమని మర్యాదగా అడిగినప్పుడు

చెయ్యమని చెప్పలేము. పోనీమంటే తప్పించుకునే తెలివితేటలూ లేవు. అది నా అదృష్టం అనండి, దురదృష్టమనండి. ఎవరికి ఏ పని పడ్డా నేను కనిపిస్తానన్నది మాత్రం నిజం. ఓ రోజు నేను డైనింగ్ టేబుల్ దగ్గర మా వాళ్ళందరితో కలిసి టిఫిన్ తింటూ 'మీ అందరికీ నేనంటే చులకన గానీ, ఊళ్ళో పెద్ద పెద్దవాళ్ళు కూడా అన్నిటికీ నా సలహాలడుగుతారు తెలుసా?' అని కాస్త నాగురించి నేను చెప్పుకోబోయాను. నా మాట సత్యం అన్నట్లు టెలిఫోను మోగింది. ఎవరో ఎత్తి కనుక్కున్నారు. నాకోసం అడుగుతున్నారుట. హెల్త్ సెక్రటరీగారు నాతో మాట్లాడుతారట. వినగానే లేచి మావాళ్ళందరికేసీ ఒక లుక్కేసి అటువెళ్ళి ఫోనందుకున్నాను. అటునుంచి మాట్లాడుతున్నది హెల్త్ సెక్రటరీ శర్మగారు. నాకు బాగానే తెలుసు. ఆయన భార్యా, నేనూ మంచి స్నేహితురాళ్ళం. "నమస్తే అండీ బాగున్నారా" అని పలకరించాను. ఇంతకీ ఆయనకి నాతో పడిన పని ఏవిటట! వాళ్ళావిడ లేవట్లేదు. ఆయన తల్లి పెద్దావిడ వీళ్ళ ఇంటికి వచ్చి ఉన్నారుట. మడి వంట చేసిపెట్టేందుకు ఎవరైనా బ్రహ్మణ వంటవాళ్ళని చూడమని. సరే సరే అని వచ్చి టేబుల్ దగ్గర కూచున్నా. ఏవిటి విశేషం అనడిగారు మావాళ్ళు 'ఏం లేదు. ఏదో సెమినార్‌ట కమిటీలో వుంటారా అని అడుగుతున్నారు' అని చెప్పి తప్పించుకున్నాను. నలుగురితో కాస్త మంచి సంబంధాలు కలిగి వుండడం కూడా నేను చేయవలసిన పనే అని గట్టిగా నమ్ముతాను. మార్కెట్ల రణరంగంలో వంటరిపోరాటం చేసే మాలాటి ఎంట్రప్రెన్యూర్స్ అందరితో చాలా మర్యాదగా మసలుకోవలసి వుంటుంది.

అవసరానికి పనికి వచ్చినా రాకపోయినా మాక్కూడా ఒక ఎసోసియేషనుంది. దానికి సుమారు డెబ్భైఏళ్ళ చరిత్ర వుంది. ఒక చిన్న స్వంత భవనం వుంది. అనేక స్థాయిలుగా విభజింపబడిన అయిదువందలమంది సభ్యులున్నారు. వాళ్ళ సంపాదనని బట్టి ఏడాదికోసారి ఫీజు కట్టేలాటి వెసులుబాటుంది. కానీ అదేమి పాపకర్మమో, కోటీశ్వరులు కూడా ఏడాదికి పదివేలు ఒక పట్టాన కట్టరు. వేరే ఏ పనీ లేకపోయినా ఎవ్వరూ ఒక్క మీటింగుకీ రారు. అటువంటి అసోసియేషన్‌కి నేను జనరల్ సెక్రటరీని. కనీసం ఆఫీసు ఖర్చులకి సరిపడా డబ్బును మా మెంబర్ల దగ్గర వసూలు చేసే మార్గాలన్వేషించడమే నాకున్న పెద్ద పని. అందుకే ఎప్పుడూ బిజీగా వున్నట్లు, చూసే వాళ్ళకనిపిస్తుంది

ప్రతినెలా మూడో శనివారం సాయంత్రం 5 గంటలకి మా కార్యవర్గసమావేశం వుంటుంది. ఖచ్చితంగా ఆరున్నరకల్లా ముగుస్తుంది. పేరుకి మా కమిటీలో

పదముగ్గురు సభ్యులమున్నాం. మా ఆఫీసులో పనిచేసే ఆవిడ లక్ష్మి పది రోజుల ముందు నుంచీ రోజూ ఫోన్ చేసి గుర్తు చేసినా అయిదారుగురు పోగయితే ఎక్కువ. ఒకవేళ పదిమంది ఎప్పుడయినా వచ్చినా ఎవరూ తమ సమస్యలు పైకి చెప్పుకోరు. చెప్పుకుంటే అవమానం కదా! అందుకని ఏవేవో పై పై విషయాలు, రాజకీయాలు మాట్లాడుకుని కాఫీతాగి బిస్కెట్లు తిని వెళ్ళిపోతారు.

కిందటి నెల జరిగిన కమిటీ మీటింగుకి ఎనిమిదిమంది వచ్చారు. అబ్బో అనుకుని ఏదో ఒక కామన్ సమస్య గురించి మాట్లాడుకోవాలి కాబట్టి అన్‌డిక్లేర్డ్ పవర్‌కట్స్ గురించి చర్చ మొదలుపెట్టాం. ఇంతలోకీ మా అపర కుబేర సభ్యుల్లో మొదటి వారైన గోయెంకా గారు హఠాత్తుగా లోపలికొచ్చారు. వెనకాలే వచ్చిన ఆయన పి.ఎ. చేతిలో బోలెడు కవర్లు. అంత పెద్దవాళ్ళు తోడు లేకుండా ఒంటరిగా ఎక్కడికీ వెళ్ళరుకదా! ఇంతలోకీ వాళ్ళ డ్రైవరు 'ఆల్మండ్ హౌస్' స్వీట్ల పాకెట్లు ఒక ఇరవై తెచ్చి బల్లమీద పెట్టి వెళ్ళిపోయాడు. గోయెంకా గారు పి.ఎ. చేతినుంచి కవర్లు తీసుకుని ఆ సమయంలో అక్కడ వున్న మా అందరికీ పేరుపేరునా స్వీట్‌బాక్సుతో సహా ఇచ్చి అక్కడలేని వాళ్ళ కార్డులు లక్ష్మి చేతికిచ్చారు. "మా అమ్మాయి పెళ్ళి నవంబరు పదహారు రాత్రి ఒకటిన్నర గంటలకి. మీరందరూ మీ కుటుంబ సభ్యులతో సహా అన్ని ఫంక్షన్స్‌కి వచ్చి మా ఆతిథ్యం స్వీకరించాలి" అని ఎంతో మర్యాదగా మళ్ళీ మళ్ళీ చెప్పి వెళ్ళిపోయారు. అందరం ఎవరి కార్డులు వాళ్ళు చదువుకోవడం మొదలు పెట్టాం. కార్డు కిలో బరువున్నట్లుంది. పైన వెండి వినాయకుడున్నాడు. ఆఖరి పేజీలో నాట్యం చేస్తున్న శివపార్వతులున్నారు. పది పేజీల ఆ కార్డులో వధూవరులు, వారి పూర్వీకుల పరిచయాలు, పెళ్ళివారి ఆగమనం, జయమాల, సంగీత్, మెహందీ, పెళ్ళి, బిదాయి ఇలా రకరకాల వివరాలున్నాయి. మాకు తెలిసిందేమంటే పెళ్ళి కూతురి తాతగారు ఎం.పి. అయితే పెళ్ళికొడుకు తండ్రి ఒక రాజావారు. ఇంక ఆ పూట సమావేశానికి కరెంటు కట్స్ చర్చ బదులు జరగబోయే పెళ్ళి చర్చ అయింది.

పెళ్ళి వారంరోజులుందనగా లక్ష్మి అందరు కార్యవర్గసభ్యులకీ ఫోన్లు చేసి ఫంక్షను గురించి గుర్తుచేసింది. అందరూ తలా వెయ్యి రూపాయలు ఇస్తే మన అసోసియేషన్ తరఫున మంచి గిఫ్ట్ కొని ఇవ్వచ్చునని మెసేజ్‌లు పెట్టింది. ఒక్కరైనా పలికితేనా! చాలా మంది అవుటాఫ్ సిటీట. కొంతమందికి వేరే ఎపాయింట్‌మెంట్సున్నాయి. మరికొందరు తాము ఫామిలీస్‌తో వెళ్ళి బహుమతి వేరేగా ఇస్తారుట. అసలు మా కమిటీలో సగం మంది డెబ్భైపైబడ్డవాళ్ళు. అందునా జైను మార్వాడీలు. ఆరు దాటితే

ఎక్కడికీ వెళ్ళరు. బయటివి ఏమీ తినరు. చివరికి చేసేదేమీలేక నాకున్న అధికారాన్ని వినియోగించి పదివేలు బాంకులో నుంచి తీసి ఇంకొక వినాయకుడ్ని చందనంతో చేసినది కొని గిఫ్ట్ పాక్ చేయించి తయారు పెట్టాను. నేనూ, మా ఛైర్మను గారూ వెళ్ళేటట్లుగా నిర్ణయించుకున్నాము.

ఇంక సాయంత్రం పెళ్ళి అనగా ఉదయం ఛైర్మను గారు ఫోన్ చేసి "సుశీల గారూ! నాకు చాలా జ్వరంగా వుంది. పెళ్ళికి రాలేను. మీరు రాజన్ గార్ని తోడు తీసుకుని వెళ్లండి. ఆయన వస్తానన్నారు" అని అన్నారు. ఏం చెప్పను? ఎక్కడున్నా నా పని డ్యూటీ మీద పెళ్ళిళ్ళకి వెళ్ళడమేనా? మా ఇంట్లోనూ అంతే! ఏ ఫంక్షనుకైనా నేనే వెళ్ళాలి. అది పెళ్ళయినా, పేరంటమయినా, నూడిదలయినా, పుట్టినరోజులయినా! మా ఆయన నన్ను వెళ్ళనివ్వడమే పెద్ద కష్టంగా భావిస్తారు. చాలా ఉదారంగా అనుమతించాననుకుంటారు. ఖచ్చితంగా తిరిగి ఎన్ని గంటలకి వస్తానో నా చేతే కమిట్ చేయించి మరీ పంపిస్తారు. బయల్దేరినప్పటి నుంచీ తిరిగి రావడం టెన్షనే! ఇంక ఆ ఫంక్షన్ సమయానికి జరిపే బాధ్యతనంతా నేనే మోస్తున్నట్లు అనిపిస్తుంది. ఇప్పుడు చూడండి. నేనీ ఎసోసియేషన్‌కి ఇంత కంచి గరుడసేవ చేస్తున్నా అర్ధరాత్రి పెళ్ళికెళ్ళే బాధ్యతను కూడా నా మీదే పెట్టారు ఇంతమంది మగధీరులూ! నాకూ కుదరదని మొండికేయచ్చు. కానీ రేపు ఆ సదరు పెద్ద మనిషి ఎక్కడన్నా కనబడి "ఏం మేడం! ఒక్కరూ రాలేదేమిటంటే నేను ఏం చెప్పాలి? అదేవిటో ఎప్పుడన్నా మరీ చేతకాక ఒక ఫంక్షన్‌కెళ్ళలేకపోతే శాపం పెట్టినట్లు వాళ్ళే నాకు నాల్రోజులకే ఎక్కడో అక్కడ కనబడి నిలదీస్తారు. అబద్ధాలు చెప్పి తప్పించుకోడం కూడా నాకు చేతకాదు.

మా ఛైర్మన్ గారు పాపం అంత జ్వరంలోనూ స్వయంగా ఫోన్ చేసి ఆదేశంలాంటి అభ్యర్థన చేశాక నేను చేయగల్గిందేముంటుంది? నాలాగే పెద్దగా పనులున్నట్లుగా పోజులు కొట్టని రాజన్ గారితో కలిసి వెళ్ళమని ఆయనే సూచించారుగా! రాజన్‌గారు మా ఎసోసియేషన్‌కి పూర్వ ఛైర్మన్. వృత్తిరీత్యా ఛార్టర్డ్ ఎకౌంటెంట్. మంచికన్సల్టెన్సీ వుంది. సుమారు అరవై ఏళ్ళుంటాయ్. పెళ్ళి చేసుకోలేదు. అందుకేనేమో ఎప్పుడూ విశ్రాంతిగా, అనందంగా వుంటారు. అలాటివాళ్ళంటే నాకు చాలా ఇష్టం. ఏదో కొంపలంటుకుపోతున్నట్లు పనులు చేసేవాళ్ళనో, ఎక్కడికో పరుగులు పెడుతూ ఇంకోళ్ళని నిలబడనీయకుండా చేసేవాళ్ళనో చూస్తే నాకు చాలా భయం. ఎందుకంటే అలాటి వాళ్ళని చూస్తే నేనేమీ గొప్ప పనులు చేయకుండా నాకున్న టాలెంట్‌ని వృధా చేస్తూ కాలక్షేపం చేస్తున్నానేమోననిపించి చాలా గిల్టీ ఫీలింగ్ వచ్చేస్తుంది.

రాజన్ గారు మధ్యాహ్నం ఫోన్ చేసి మేమిద్దరం మా కారులోనే వెళ్ళేటట్లు తనని సాయంత్రం ఏడున్నరకి తార్నాకాలో పికప్ చేసుకునేట్లు నిర్ణయించారు.

ఈ మధ్య పెళ్ళిళ్ళు చేసేవాళ్ళు ఎంత డబ్బున్నవాళ్ళయితే వూరికి అంత దూరంగా చేస్తున్నారు. దీనివల్ల కొన్ని లాభాలున్నాయి. తక్కువస్థాయి బడుగు జీవులు అర్ధరాత్రి తిరిగి రావడం కష్టమని వచ్చే సాహసం చేయరు. ఎటూ సాటివాళ్ళకి కార్లుంటాయ్ కదా! ఇంక అతిథులు కూడా ఖచ్చితంగా పెళ్ళికనే వస్తారు. వూరి మధ్యలో వెన్యూ అయితే ఏదో నాలుగు పనుల మీద తిరుగుతూ మధ్యలో తొంగి చూసి భోజనం చేసిపోయే ప్రమాదం వుంటుంది మరి.

మన పెళ్ళివారి ఫంక్షను విజయవాడ రోడ్డు మీద ఒక ఇరవై కిలోమీటర్లు వెడితే వస్తే వస్తుంది. ఎందుకంటే అక్కడ మళ్ళీ కుడి ఎడమలకి తిరిగి ఎంత దూరం వెళ్ళాలో! మేమిద్దరం ఏవేవో లోకాభిరామాయణం చెప్పుకుంటూ సుమారు నలభై నిముషాలు ప్రయాణం చేశాక రంగురంగుల లైట్ల తోరణాలు కనిపించాయి. రోడ్డుకిరువైపులా అన్ని చెట్లూ కలర్ బల్బులు పూశాయి. ప్రతి పది గజాలకి స్వాగత ద్వారాలు, మళ్ళీ వాటిమీద చిత్రవిచిత్రమైన డిజైన్లతో రంగుల లైట్లు. పెళ్ళి వేదికకి అయిదారు కిలోమీటర్ల ముందునుంచీ అలంకారం చేసారు. ఒక్కొక్క కూడలిలో గుండ్రంగా రకరకాల పూలతో మడులు ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల పువ్వులతో ముగ్గులు వేసి, అవి కనపడేలా పెద్ద లైట్లమర్చారు. ఇంకొక కూడలిలో పెద్ద నీటి మడుగు తయారు చేసి కలువపూలు వేశారు. మా కారుని నెమ్మదిగా పోనిస్తూ వాటిని చాలా వివరంగా చూశాము. వాళ్ళు అమర్చిన పుష్పాలన్నిటినీ విదేశాలనించే తెప్పించారని తరువాత ఎవరో చెప్పుకుంటుంటే విన్నాను. అన్నట్లు ఒకచోట నెమళ్ళని, మరొకచోట చిన్న సెలయేరు అందులో అందమైన బాతుల్ని కూడా వదిలారు. కనుల పండుగ్గా వున్న ఆ కల్యాణ మంటప శోభను చూస్తూ ఆనందిస్తూ ముఖ్య ప్రవేశద్వారం దగ్గిరకి చేరాం.

వాకిట్లో కాపేసిన పెద్ద పోలీసు బలగం మేం టెర్రరిస్టులం కాదని తేల్చుకున్నాక మమ్మల్ని లోపలికి వదిలారు. అక్కడ టేబుల్ దగ్గర పన్నీరు జల్లి అతిథి మర్యాదలు చేసే అప్సరసలు మా చేతిలో వున్న పాకెట్టుని చూసి "మేడం! ఇది మా దగ్గర వదిలి వెళ్ళండి. ఇవన్నీ వేదిక వద్దకు చేరుస్తాం. మీ టోకెను నంబరు చెప్తే అక్కడ మీకు దీన్ని అందిస్తారు. ఇంతసేపు పట్టుకు తిరగడం కష్టం కదా" అని అంటూ మా చేతిలో వున్న పాకెట్టును తీసుకుని టోకెన్ చేతిలో పెట్టారు. ఇంక ప్రాణం ఎంత తేలిక పడిందో! మా పేర్లు, కారు నంబరు అడిగి రాసుకున్నారు. అదెందుకో తర్వాత

తెలిసింది. ప్రవేశ ద్వారాన్నుంచి కనీసం నాలుగు ఫర్లాంగులయినా నడిస్తే గాని వివాహవేదిక రాదు. మొత్తం ఆ ప్రదేశం పదెకరాల నేలలో విస్తరించినట్లనిపించింది నాకు. వేదిక మీద ఇంకా పెళ్ళికొడుకూ, పెళ్ళికూతురూ వాళ్ళ తాలూకు వాళ్ళెవరూ కనిపించలేదు. అది సికింద్రాబాదు ప్లాట్‌ఫారమంత వుంది. ఇంక ఆ అలంకారాలనయితే నేను వర్ణించలేను.

రిసెప్షను తొమ్మిదిగ్గానీ మొదలవదుట. పెళ్ళి రాత్రి ఒకటిన్నరకి. ఇంక మాలాగా వూరికి ముందే చేరుకున్న అతిథులు ఏదో ఒకటి తింటూ తిరుగుతూ హైదరాబాదు ఎగ్జిబిషన్లోలాగా నాలుగు ప్రత్యేక వేదికల మధ్యగా తిరుగుతుండచ్చు. ఆ చిన్న వేదికలు నాలుగూ నాలుగుపక్కలా వున్నాయి. ప్రతిదాని ముందరా కొన్ని గుండ్రం బల్లలూ, కుర్చీలూ వేసి వున్నాయి. ఒకదానిమీద హాస్య కార్యక్రమాలు, జోకర్ల ప్రదర్శన, మిమిక్రీ జరుగుతోంది. దూరంగా వున్న ఇంకొక వేదిక మీద శాస్త్రీయ సంగీత కళాకారులు కూచుని సితారు, ఫ్లూటు, జలతరంగ్ వాయిస్తూ వాద్యగోష్ఠి చేస్తున్నారు. మూడవదాని మీద కథక్, భరతనాట్యం, మణిపురి లాంటి నృత్యప్రదర్శలు ఏర్పాటు చేసారు. ఇంక చివరిదాని మీద కొంతమంది యువకులు పాశ్చాత్య సంగీత వాయిద్యాలను శృతి కలుపుకుంటున్నారు. ఆ హెూరు ఆలస్యంగా మొదలవుతుందిట. ఇవన్నీ చాలవన్నట్లు ప్రతి పదిగజాలకీ టి.వి.లలో ఈ వధూవరుల నిశ్చయతాంబూలాలు, మూడు రోజుల ముందు జరిగిన సంగీత్, మెహంది వీడియోలు నిర్విరామంగా చూపిస్తున్నారు. పెళ్ళికూతురు పుట్టిన దగ్గర్నించీ ఆ రోజు వరకూ ఎలా ఎదిగిందో చెప్పే బొమ్మలే బొమ్మలు.

ఏవిటో అంతా అయోమయంగా అనిపించి భరతనాట్యం జరుగుతున్న వేదిక ముందున్న టేబిల్ దగ్గర సెటిల్ అయ్యాము. భోజనాలు ఎక్కడో దూరంగా కనిపిస్తున్నాయి గానీ పెద్ద పట్టించుకోకుండా కూచున్నాం. మేం కూచోగానే రాజభటుడిలాంటి యూనిఫాంను వేసుకుని వున్న ఒక కుర్రవాడు రెండు మంచినీళ్ళ బాటిల్స్ ముందుంచి చెరో నాలుగు కార్డులూ చేతిలో పెట్టాడు. భోజనాలన్నీ అక్కడ వున్నాయి మేడం! కానీ మీరు వెళ్ళవలసిన అవసరం లేదు. ఈ మెనూ కార్డులు చూసి చెప్తే నేను సర్వ్ చేస్తాను అని చాలా వినయంగా చెప్పాడు. మొదటి కార్డు పానీయాలు, రెండవది ఫలహారాలు, మూడవది ఉత్తర దక్షిణ, తూర్పు, పడమర భారతదేశపు మరియు చైనా, అమెరికా, ఇటలీ, థాయ్‌లాండ్ వగైరా దేశాల ప్రశస్తమయిన ఆహార పదార్థాల వివరాలు, నాల్గవదానిలో రకరకాల మిఠాయిలు, హల్వాలు, ఐస్‌క్రీములు కేకులు వగైరా. మేమేమన్నా ఘటోత్కచుని వారసులమా!

చూసి ఆనందించినా కడుపునొప్పి వచ్చి పడేట్లున్నాం. నేను ఒకసారి ఏదో పెళ్ళికి వెళ్ళినప్పుడు బఫే టేబుల్ మీద ఉన్న ఆహారపదార్థాలు చూసి "అబ్బా ఇన్ని పెడితే ఎలా తినగలం" అని విసుక్కున్నాను. "అన్నీ తినమని కాదు వాటిల్లో నీకు నచ్చినవి తినగలిగినవి తినమని అర్థం" అని మా ఆయన వివరించారు.

ముందు రాజన్‌గారు ఏదో వైనూ, నేను పైనాపిల్ జ్యూస్ దానితో పాటు స్ప్రింగ్‌రోల్సు, పనీర్ పకోడా తెప్పించుకున్నాం. అలా ఒక గంటసేపు రకరకాలు రుచి చూస్తూ వుండగానే జనం సందడి మొదలయింది. వధూవరులు వేదిక మీద కనిపించగానే ఒక్కొక్కళ్ళే వెళ్ళి వారిని అభినందించి వచ్చి మళ్ళీ కూచుంటున్నారు. మేము మళ్ళీ ఇంతదూరం నడవడం ఎందుకు? ఏకంగా వెళ్ళేటపుడే కలుద్దాంలే అని బద్ధకించి లేవలేదు. ఆ వడ్డించే కుర్రాడు పదినిముషాలకొకసారి మా చుట్టూ తిరుగుతూనే వున్నాడు. వాడు చిన్నబుచ్చుకోకుండా మేం ఏదో ఒకటి చెప్తూనే వున్నాము. సరే భోజనమయితే అయింది కానీ అయిస్‌క్రీం కార్డు కేసి చూడాలన్నా చేతకావడం లేదు. "సరే! ఎలాగోలా లేచి వధూవరులని కలిసి వద్దాం. కష్టమయినా! తప్పద"నుకుని లేచాం నాలుగడుగులు వేసి వేదికవైపుకి చూస్తే మా ఇంటి దగ్గర శుక్రవారం రేషనుషాపు క్యూ గుర్తొచ్చింది. అక్కడ నిలబడ్డ జనాల వరస తాలూకు తోక ఎక్కడుందో తెలియలేదు. అమ్మో! అందులో ఇరుక్కుంటే గంటసేపు నిలబడాలి. కాస్త రష్ తగ్గాక వెడదాం లెమ్మని మా సీట్లో మేం కూచుని అయిస్ క్రీం ఆర్డరిచ్చాం. అరగంటసేపట్లో అది తినడం కూడా అయింది. ఇంక ఫరదర్‌గా ఏదన్నా తినడం మా వల్ల కాదు. మళ్ళీ క్యూ కేసి చూస్తే ఎయిర్‌పోర్టులో బోర్డింగ్ అవడానికి ఖంగారుపడే పెద్ద మనుషుల క్యూ గుర్తొచ్చింది. ఈసారి చిరంజీవితో మొదలు పెట్టి అందరు నటులు, నటీమణులూ, దర్శకులూ, నిర్మాతలూ, గాయనీ గాయకులూ, బుల్లితెర కళాకారులూ, ఇంకా ఎవరెవరో అదే క్యూలో చంద్రబాబు నాయుడు గారు, వారి వందిమాగధ గణాలు, అనుచరులు కనబడ్డారు. అధికారంలో లేకపోతే ఎంతటి వాడయినా క్యూలో నిలబడక తప్పదు. ఆయనకన్నా ముందు ఢిల్లీ నుంచి వచ్చిన కొద్దిమంత్రులు, ఎం.పి.లు వాళ్ళకి తోడుగా కొందరు పాత్రికేయ బంధువులూ కనిపించారు. ఈలోగా ఒక పాతికమంది అధికార గణాలు, కార్యకర్తలు జయఘోషలు చేస్తుండగా కుడి ఎడమల డాల్ కత్తులు మెరయగ రాజశేఖర్‌రెడ్డి గారు, వారి అమ్మాయి వచ్చి క్యూ పట్టించుకొకుండా తిన్నగా డయాస్ ఎక్కి ఫొటోలు తీయించుకుని వెళ్ళిపోయారు. ఇంకా ఇంకా ఆలస్యం చేసినకొద్దీ వచ్చేవాళ్ళ హోదా పెరుగుతోంది. దాంతో తిరుపతి దేవుడి ముందులాగా క్యూ కదలట్లేదు. క్యూలో నిలబడ్డవాళ్ళకి మోక్షం లభించడం లేదు. ఏమో ఎవరు చూడొచ్చారు! సోనియా గాంధీ వచ్చినా రావచ్చు.

అప్పుడందర్నీ బయటికి పంపేస్తే ఏందారి?

ఇప్పటి వరకు మనకి తెలిసున్న మొహాలే గాని మనం తెలిసున్న ఒక్క మొహం కూడా తారసపడలేదు ఆ వడ్డించే కుర్రాడు తప్ప. మన స్టేటస్ ఏమిటో బాగా అర్థం అయిపోయింది కదా? ఇంక ఇద్దరం కూలబడి సమాలోచన చేయడం మొదలుపెట్టాం. "మనిద్దరం ఇప్పుడు ఒక గంట సేపు క్యూలో రకరకాల వీఐపీల మధ్య గంటసేపు నిలబడి ఆ డయాస్ మీద వాళ్ళకి షేక్‌హాండ్ ఇవ్వడం అవసరమా? ఈ పరిస్థితులలో నేను గంటసేపు నిలబడగలనా? వాళ్ళు పెడతామన్నవన్నీ మళ్ళీ మళ్ళీ అడిగి తెప్పించుకుని తిన్నాం కదా! అంటే వాళ్ళని ఆశీర్వదించినట్లే కదా! ఎటూ మనం టోకెన్ తీసుకుని పంపిన బహుమతి సాక్ష్యం వుంది కదా! అయినా మేం స్టేజ్ ఎక్కామో లేదో ఎవరికి తెలుస్తుందీ? వీడియోలో పడకపోయినా మేం తింటున్నతసేపూ ఎవడో ఒకడు వచ్చి ఫొటోలు తీస్తూనే వున్నాడు కదా!

ధైర్యం తెచ్చుకుని అటూ ఇటూ చూసి బయల్దేరాం. దూరం నుంచే వధూవరులని చూసి మనసారా అక్షింతలు వేసి బయటపడ్డాం. అదృష్టవశాత్తూ తిరిగి వచ్చేటపుడు ఎవరూ చెక్ చేయలేదు. గేటు దగ్గరున్న మైకులో ఎనౌన్స్ చేసిన అయిదు నిముషాల్లో మా డ్రైవరు కారు తీసుకుని వచ్చాడు. కారు బయల్దేరి కాస్త వూళ్ళో పడ్డాక, "నీకు ఆలస్యమయిపోయింది. అక్కడ ఏమీ హొటళ్ళు కూడా లేవు! నేనూ డబ్బులివ్వడం మర్చిపోయాను" అన్నాను. "ఫరవాలేదమ్మా! అక్కడ పార్కింగ్‌లాట్‌లో డ్రైవర్లకి భోజనాలు పెట్టారు. చాలా బాగా పెట్టారు" అని డ్రైవరు సంతృప్తిని ప్రకటించాడు. పెళ్ళి తాలూకు వాళ్ళు వచ్చి మీకు రెండు పాకెట్లిచ్చారమ్మా అని నాచేతికిచ్చాడు. ఒకదానిమీద శ్రీ రాజన్, ఇంకో దానిమీద శ్రీమతి సుశీల అని రాసి వున్నాయి. నాకు చెయ్యూరుకోదుగా, వెంటనే విప్పి చూశాను. మేం కష్టపడి వచ్చినందుకు ధన్యవాదాలతో ఒక వుత్తరం, వెండితో చేసిన చిన్న సీతారాముల విగ్రహం కనపడ్డాయి. అబ్బ! ఎంత సంతోషం వేసిందో! భోజనాలొక ఎత్తు! ఈ బహుమతి ఒక ఎత్తు అనుకున్నాను.

కారులో కాసేపు కళ్ళు మూసుకు పడుకున్నాక అడిగాను "రాజన్! నీకు భరద్వాజ విందు తెలుసా?" అని.

"ఆయనెప్పుడు విందు ఇచ్చాడు"? అని అడుగుతూ నిద్దట్లోనే అలోచనలో పడ్డాడు. "ఇచ్చాడ్లే! వనవాసానికి వెళ్ళిపోయిన రాముడిని వెతుకుతూ రాజపరివారంతోను, అపార సేనావాహినితోను బయల్దేరిన భరతుడికి దారిలో ఒక పూట భరద్వాజుడు ఆతిథ్యమిచ్చాడు. దాన్ని ఎంత గొప్పగా వాల్మీకి మహర్షి వర్ణిస్తారో! అడవుల్లో తపస్సు

చేసుకునే ఋషికి ఇన్ని విధాలైన భోగాలుంటాయని తెలుసా అని ఆశ్చర్యం వేస్తుంది. "అనేక జాతులకి చెందిన అప్సరసలు సైనికులకి సేవలు చేశారు. ఆ అందగత్తెలు సైనికులకి నలుగులు పెట్టి స్నానాలు చేయించి రకరకాల అలంకారాలు చేసి మధువు తాగించారు. అనేక ఫలరసాలు, మధువులతో నదులు ప్రవహించాయి. తుంబుర, నారదుల వంటి గాయకులు సంగీతాన్నాలపించారు. అనేక పుష్ప ఫలవృక్షాలు నెమ్మదిగా వూగుతూ వారి అలసటను పోగొట్టాయి. ఒకటేమిటి వాయువు మందంగా గాలులు వీస్తే వరుణుడు పుష్పవర్షం కురిపించాడు. చంద్రుడు రకరకాల భోజనాలు సమకూర్చాడు. లతలే అప్సరసలుగాను, అప్సరసలే లతలుగాను నర్తించారు. ఆ సైన్యంతో వచ్చిన ఏనుగులకి గుర్రాలకి కూడా మంచి ఆహారాన్ని పెట్టి ఆదరించారు. ఆ మర్యాదలు తట్టుకోలేక సైనికులు స్వర్గమంటే ఇదే ఇదే అని ప్రకటించారు" అని అందంగా వివరించారు. చూశారా! రామాయణకాలంలోనే కారడవిలో కూచుని ఒక తపస్వి ఎలాంటి విందు ఇచ్చాడో" అన్నా!

"అయ్యో! మన ఫ్రెండుకివన్నీ తెలిసినట్లు లేదు. తెలిస్తే మరికొన్ని ఏర్పాట్లు చేసుండేవాడు ఇంకా బాగుండేది" అని అంటూ మళ్ళీ నిద్దట్లోకి జారుకున్నాడు.

✤